గెలుపు ధీమాలో.. పార్టీలు




- జిల్లాలో క్రాస్ ఓటింగ్ కలవరం
- బీఆర్ఎస్ కార్యకర్తల ఓట్లు ఎటువైపు ?
- ఏ పార్టీకి అనుకూలమో...?
- అంచనాలు కడుతున్న అభ్యర్థులు
- పోలింగ్ శాతంపై లెక్కలు

నిర్మల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : లోకసభ ఎన్నికల్లో భారీ ఎత్తున బీఆర్ఎస్ ఓటు క్రాస్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. నిర్మల్ జిల్లాలో గత నెల రోజుల నుంచి బీఆర్ఎస్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, క్రియాశీల కార్యకర్తలంతా వరుస కట్టి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరిపోవడం ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి పెద్ద ఎత్తున నష్టం చేకూర్చిందంటున్నారు. అయితే వీరంతా మెజార్టీగా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీ బలహీనపడి ఆ పార్టీ సానుభూతిపరుల ఓటింగ్ తమకు అనుకూలంగా మారిందని కాంగ్రెస్ పార్టీ ఆశలు పెట్టుకుంటుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలంతా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సీరియస్‌గానే కృషి చేశారు. తమ తమ పరిధిలో మెజార్టీ ఓట్లను సాధించి తమ సత్తాను చాటుకోవాలని ఈ నేతలంతా తంటాలు పడ్డారు. స్థానికంగా తమ బలాన్ని నిరూపించుకునేందుకు ఎన్నికలను వారంతా వేదికగా చేసుకొని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించడమే కాకుండా గెలుపు కోసం కృషి చేశారు. దీని కారణంగా కాంగ్రెస్ పార్టీ తన గెలుపుపై ఆశలు రెట్టింపు చేసుకుంది. ఓ వైపు మహిళలు, యూత్, మైనార్టీలు తమకే అనుకూలంగా ఓటు వేశారని ముఖ్యంగా గ్రామస్థాయిలో పోలింగ్ శాతం ఎక్కువ కావడం తమకు అనుకూలిస్తుందని కాంగ్రెస్ పార్టీ అంచనాలు వేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పోలైన ఓట్లన్ని దాదాపుగా 80శాతం వరకు తమ పార్టీకి పోలై ఉంటాయని కాంగ్రెస్ నేతలు లెక్కలు కడుతున్నారు. కాగా బీజేపీ సైతం బీఆర్ఎస్ సానుభూతిపరులంతా తమకే ఓటు వేశారని, మోడీ నాయకత్వానికి వారంతా మద్దతు తెలిపారని భావిస్తున్నారు. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న నేతలు, కార్యకర్తలంతా ప్ర ధాని నరేంద్రమోడీని బలపరిచేందుకు మొగ్గు చూపారని దీనికారణంగా వారంతా బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారని ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ నాయకులంతా గ్రామాల వారిగా పోలింగ్ సర్వే జరుపుతూ ఏ వర్గం తమకు ఓటు వేసిందో, ఎవరెవరు వ్యతిరేకించారోనన్న విశ్లేషణలు జరుపుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ మహిళలు, రైతులు, యూత్ ఓట్లపై ఆశలు పెట్టుకుంటుండగా బీజేపీ కూడా అటు యూత్, మహిళలు, విద్యావంతులు ఓట్లపై ఆశలు పెట్టుకుంటున్నాయి. కాగా కాంగ్రెస్, బీజేపీ నేతలంతా గ్రామాల వారిగా ఓటింగ్ సరళిని విశ్లేషిస్తూ గెలుపు పట్ల ఆశలు పెంచుకుంటున్నాయి.



జిల్లాలో పెరిగిన పోలింగ్ శాతం

జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల కన్నా ఈ సారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెరిగింది. నిర్మల్ నియోజకవర్గంలో 71.68 శాతం, ముథోల్ నియోజకవర్గంలో 75.63శాతం, ఖానాపూర్ నియోజకవర్గంలో 72.20శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు అధికారికంగా వెల్లడిస్తున్నారు. అయితే నిర్మల్ నియోజకవర్గంలో మొత్తం 2,58,314 లక్షల ఓట్లకు గానూ 1,85,168 లక్షల ఓట్లు పోలయ్యాయి. అలాగే ముథోల్ నియోజకవర్గంలో మొత్తం 2,54,579లక్షల ఓట్లకు గానూ 1,92,546 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఖానాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,04,563 లక్షల ఓట్లకు గానూ 1,42,100లక్షల ఓట్లు పోలయ్యాయి. నిర్మల్ నియోజకవర్గం కన్నా ముథోల్ నియోజకవర్గంలో ఈ సారి ఎక్కువగా పోల్ అయ్యింది. ఇక్కడ 75.63శాతం అధికంగా ఓట్లు పోలయ్యాయి.

యూత్, రూరల్ పోలింగ్ శాతంపైనే భారీ అంచనాలు

ఇదిలా ఉండగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోలింగ్ శాతాన్ని విశ్లేషిస్తూ గెలుపు అంచనాల్లో తలమునకలవుతున్నాయి. ముఖ్యంగా యూ త్, రూరల్ పో లింగ్ శాతం తమకు అనుకూలిస్తుందంటూ మూడు పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గతానికి భిన్నంగా ఈ సారి యూత్, రూరల్ ప్రాంతాల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం ఏ పార్టీకి అనుకూలిస్తుందో ఏ పార్టీకి నష్టం చేకూరుస్తుందోనన్న అంచనాలు మొదలయ్యాయి. అయితే మూడు పార్టీలు సైతం పోలింగ్ సరళిపై అంతర్గతంగా ఆందోళనకు గురవుతున్నప్పటికి బయటకు మాత్రం గెలుపు ధీమాను వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



ఫలించిన శ్రమ...

చాలా రోజుల నుంచి జిల్లా యంత్రాంగమంతా లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలోనే తలమునకలైంది. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నేతృత్వంలో ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను కలెక్టర్ పకడ్బంధీగా ప్రతిరోజు సమీక్షలు నిర్వహిస్తూ ఎన్నికల పనుల ప్రగతిపై ఆయన సంబంధిత అధికారులను ఊపిరి సలపనీయలేదు. అధికార యంత్రాంగం రాత్రింబవళ్ళు శ్రమించడంతో ఎక్కడ కూడా ఎలాంటి చిన్న సంఘటన జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగడం పట్ల అధికార వర్గాలు ఊపిరి పీల్చుకుంటున్నాయి.

వాసవీమాత జన్మదినోత్సవ పూజలు



పూజలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

నిర్మల్ కల్చరల్, మే 18 : నిర్మల్ పట్టణం సాకెర గ్రామ పరిసరాల్లోని వాసవీ మాత ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేకపూజలు చేశారు. అభిషేకం, కుంకుమపూజ, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్యులతో పాటు కమిటీ సభ్యులు, సమీప గ్రామాల భక్తులు హాజరయ్యారు. అన్నప్రసాద వితరణ గావించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి ఆమెడ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, మే 18 : పట్టణ శివారులోని గండిరామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన జొన్నల మనోహర్ దంపతులు తమ పెళ్లి రోజును పురస్కరించుకుని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఇక్కడి ఆలయంలో దాతల సహకారంతో ప్రతీరోజు భక్తుల కోసం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి నేటితో నాలుగు నెలలు పూర్తయిందన్నారు. సాయి భక్తులు తమ ఇళ్లలో జరిగే పుట్టిరోజు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభ కార్యాలను పురస్కరించుకుని ఇక్కడి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమంలో దాతలు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూముల బహిరంగ వేలం

తానూర్, మే 18 : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఇనాం భూములను వేలం వేయనున్నట్లు మండల తహసీల్దార్ తెలిపారు. మండల కేంద్రం తానూర్‌లోని సర్వేనెంబర్ 37లోని 19.06 ఎకరాలు, 67లోని 92.17ఎకరాలు, 191లోని 54.12 ఎకరాల భూమికి ఈ నెల 20వ తేదిన తహసీల్దార్ కార్యాలయంలో, బామ్ని గ్రామంలోని 65లో గల 3.18ఎకరాలకు ఈ నెల 21వ తేదీన గ్రామ చావడిలో, మహాలింగిలోని 38లో గల 0.32 ఎకరాలకు ఈ నెల 22వ తేదీన గ్రామపంచాయతీలో, బెంబర్‌లోని 31లోగల 6.17ఎకరాలకు 23వతేదిన గ్రామపంచాయతీలో, తొండాలలోని 20-జేపిఎన్‌లో గల 8.11 ఎకరాలకు 24వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికిగాను నిర్వహించే ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ప్రతి సర్వే నెంబర్‌కు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

రైతు సమస్యలపై

సీఎంకు వినతిపత్రం ఇచ్చిన బీజేపీ ఎమ్మెల్యేలు



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

నిర్మల్ కల్చరల్, మే 18 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీజేపీ ఎమ్మెల్యేలు శనివారం సెక్రటేరియట్‌లో కలిసి రైతుసమస్యలపై వినతిపత్రం అందజేశారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని పేర్కొన్నారు. తడిసిన ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు నష్టపోతున్నారని, రైతుబంధు, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని, ఇతర అంశాలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రామారావు పటేల్, రాకేష్ రెడ్డి ఆయనతో పాటు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.


నిరుపేద క్రీడాకారిణికి ఆర్థిక సహాయం



నాగలక్ష్మికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్, మే 18 : మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి నాగలక్ష్మికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. కిక్ బాక్సింగ్‌లో రాణిస్తూ నేషనల్ ఛాంపియన్ పోటీలకు ఎంపికైన నాగలక్ష్మికి పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రూ. 20,000లను కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల శాఖ ద్వారా నాగలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆకుల వెంకాగౌడ్, జిల్లా నాయకులు జంగిలి శంకర్, మేడంపెల్లి సర్పంచ్ రాజు నాయక్, మండల నాయకులు పొలంపెల్లి సచిన్, మాధవ్, సుజాత, హైదర్, శంకర్, చరణ్, తదితరులున్నారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థికి 2,623 ర్యాంక్



నిర్మల్ కల్చరల్, మే 18 : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రన్స్ ఫలితాల్లో నిర్మల్ విద్యార్థిని 2,623 ర్యాంక్ సాధించింది. నిర్మల్‌లోని ఎస్ఆర్ గర్ల్స్ కళాశాల విద్యార్థిని శ్వేత శనివారం వెలువడిన ఫలితాల్లో ర్యాంక్ సాధించి జిల్లాలోనే ప్రభంజనం సృష్టించింది. కళాశాల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్, డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి దేవిదాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు శ్వేతను ఈ సందర్భంగా అభినందించారు.

గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- జిల్లాలో ఏర్పాట్లు వివరించిన కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 18 : టీఎస్పీఎస్సీ గ్రూప్- 1 పరీక్షలు జూన్ 9న పకడ్బందీగా నిర్వహించాలని చైర్మన్ మహేందర్‌రెడ్డి కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన పలు సూచనలు చేశారు. మాస్ కాపీయింగ్, లీకేజీలకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల ఎంపిక పూర్తి చేసి, నిర్వహణ బాధ్యత స్థానిక స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు అప్పగించాలని సూచించారు. అధికారులు కేంద్రాలు సందర్శించి సీసీ కెమెరాలు, ఫర్నిచర్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించేలా చర్య తీసుకోవాలన్నారు. 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ కేంద్రాల మూసివేత, పోలీసు భద్రతపై దిశానిర్దేశం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్‌ఫోన్లు కేంద్రంలోకి అనుమతించవద్దన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది ఏర్పాటు తదితర వాటిపై దృష్టిపెట్టాలన్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లాలో పరీక్షల ఏర్పాట్లను వివరించారు. జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4,608 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పటిష్ట బందోబస్తు, సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నెంబర్ 6305646600 ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్ గంగారెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డి, వైద్యాధికారి ధనరాజ్, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, ఏవో సూర్యారావు, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించని

ఆసుపత్రులపై కఠినచర్యలు

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్

నిర్మల్ అర్బన్, మే 18 : నిర్మల్ పట్టణంలోని పలు ఆసుపత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, పాలి క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు, ఐ క్లినిక్‌లు, ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధా, యోగ, నేచురోపతి వంటి అన్ని ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అదే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆసుపత్రులు గడువు ముగిసే సమయానికంటే మూడు నెలల ముందే రెన్యువల్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఆసుపత్రిలో అందిస్తున్న సేవల వివరాలు, చార్జీలు, ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్స్ వివరాలు అన్నీ కూడా డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు. నియమ నిబంధనలు పాటించని ఆసుపత్రులపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. నియమ నిబంధనలు పాటించని సాధన నర్సింగ్ హోమ్, వాగ్భత ఆయుర్వే హాస్పిటల్, సుప్రియ డయాగ్నొస్టిక్ ల్యాబ్, లక్ష్మీ నరసింహ డయాగ్నొస్టిక్ సెంటర్, నోటీసులు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డిప్యూటీ జిల్లా విస్తరణ అధికారి, మీడియా అధికారి బారే రవీందర్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్

1,236 ర్యాంకు


సాధించిన రైతు బిడ్డ



ఉదయ్‌కిరణ్

భైంసా రూరల్, మే 18 : మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన నరశెట్టి ఉదయ్‌కిరణ్ టీఎస్ ఎంసెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 1,236వ ర్యాంకు సాధించాడు. రైతు కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి ర్యాంకు సాధించిన నరశెట్టి ఉదయ్‌కిరణ్‌ను, తల్లిదండ్రులను ఇలేగాం గ్రామస్థులు అభినందించారు.

చించోలి(బి)లో రోడ్డును వెడల్పు చేయాలి



సారంగాపూర్, మే 18 : మండలంలోని చించోలి(బి)లో నిర్మల్, స్వర్ణ రహదారి ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. మహారాష్ట్ర నుంచి ప్రతీరోజు అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించడంతో రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాం దోళనకు గురవుతున్నామని వాహన చోదకులు పేర్కొంటున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో గంటల పాటు వాహ నాలు నిలిచిపోతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులకు గురవుతున్నామంటున్నారు. ఇప్పటికైనా పాల కులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఈ రోడ్డును వెడల్పు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, మే 18 : నిర్మల్ పట్టణ సబ్‌స్టేషన్ పనుల నిర్వహణ దృష్ట్యా ఆదివారం పలు ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ నాగరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బుధవార్‌పేట్, చిక్కడపల్లి, ప్రియదర్శిని నగర్, పాత మార్కెట్, ఎస్పీ, కలెక్టర్ క్యాంపు కార్యాలయం, నటరాజ్‌నగర్, ఇందిరా నగర్, భాగ్యనగర్, విజయనగర్ కాలనీ, గొల్లపేట, శాస్త్రినగర్, ఏరియా ఆసుపత్రి, బర్కత్‌పురా తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జూన్ 10 లోగా ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ కల్చరల్, మే 18 : రాష్ట్రంలోని ఐటీఐ కళాశాలల్లో పలు కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని నిర్మల్ రాజీవ్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నిర్మల్ కళాశాలను వెబ్ ఆప్షన్లలో ఎంచుకోవాలని కోరారు. నిర్మల్ కళాశాలలో జూన్ 10 వరకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రిషన్ 80, ఫిట్టర్ 20, ఏసీ రిఫ్రిజిరేషన్‌లో 24, వెల్డర్ 40, డీజిల్ మెకానిక్ 48, కంప్యూటర్ ఆపరేటర్ - ప్రొగ్రామింగ్ అసిస్టెంట్స్ 48, డ్రెస్ మేకింగ్ కోర్సుల్లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పది అర్హత గల విద్యార్థులు కలర్ ఫోటోలు, మెమో, ఆధార్, కుల, తదితర ధ్రువీకరణ సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు ఉచితంగా చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

జీపీఎఫ్ నిధుల విడుదలకు వినతి

నిర్మల్ కల్చరల్, మే 18 : జిల్లాలోని ఉపాధ్యాయ ఉద్యోగస్తులకు జీపీఎఫ్ రుణాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా నాయకులు వై. సాయన్న, రవిరాజ్ శనివారం జడ్పీ సీఈవో గోవింద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హరిప్రసాద్, గంగాధర్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు'

నిర్మల్ కల్చరల్, మే 18 : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అందులో పని చేసే ఉపాధ్యాయులపై విద్యార్థుల టార్గెట్‌రీచ్ కావాలని ఒత్తిడి చేయడం, లేదంటే వేతనాలు ఇవ్వమనడం సరి కాదని ప్రవాసిమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. స్వదేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఉపాధ్యాయులను వేధిస్తున్నారని ఆరోపించారు.

చల్లబడ్డ వాతావరణం

నిర్మల్ కల్చరల్, మే 18 : జిల్లాలో కురిసిన వర్షాలతో ఒక్కసారి వాతావరణం చల్లబడింది. శనివారం జిల్లాలో 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కుంటాల, మే, 18 : వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతుల నుంచి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి హన్మండ్లు అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాలతో పాటు ఓలా గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు సరైన తేమశాతంతో కూడిన ధాన్యాన్ని కేంద్రాల్లోకి తీసుకవచ్చి విక్రయించాలని, కొనుగోళ్ల ప్రక్రియ త్వరలో ముగిసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట సొసైటీ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, మహేష్, తదితరులు ఉన్నారు.


కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న డీటీ హన్మండ్లు

పాఠశాలల మరమ్మతులు

త్వరితగతిన పూర్తి చేయాలి


విట్టాపూర్ పాఠశాలలో తరగతి గదులను పరిశీలిస్తున్న డీపీవో

కుంటాల, మే, 18: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని విట్టాపూర్ గ్రామంలో పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. జూన్ 5వ తేది లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈయన వెంట పంచాయతీ రాజ్ డీఈ సురేష్, ఏపీవో నవీన్, ప్రధానోపాధ్యాయులు సాయినాథ్, తదితరులు ఉన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు


అధునాతన దోబీఘాట్

రజక కులస్థుల సౌకర్యార్థం గత ప్రభుత్వం ఆధునాతన హంగు లతో పిట్టలవాడలో దోబీఘాట్‌ను నిర్మించింది. వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో దీనిని నిర్మించగా 2021లో అప్పటి ఎమ్మెల్యే దీనిని ప్రారంభించారు. అప్పటి నుంచి వారం రోజుల పాటు అధునాతన యంత్రాలతో కూడిన వాషింగ్ విధానం ఉపయోగంలో ఉండేది. కాని పక్షం రోజులకే దీనిని మళ్లీ మూసేశారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ అధునాతన యాంత్రీకృత దోబీఘాట్ ఎలాంటి ఉపయోగం లేకుండా పోవడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా దోబీఘాట్ పరిసరాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు మొలవడంతో పశువులు సంచరిస్తున్నాయి. ఇప్ప టికైనా దీనిని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

మొరం మాఫియా పెట్రేగి పోయింది

బోథ్, మే 18: మండలంలో మరో మాఫియా రాజ్యమేలుతుంది. అడిగి వారు లేకపోవడంతో ఒకప్పటి ఎత్తైన గుట్టలు నేడు లోతైన గుంతలుగా మారాయి. పచ్చని చెట్లతో కళకళలాడే గుట్టల్లో జేసీబీల చప్పుళ్లతో పాటు మొరం తీసుకువెళ్లే టిప్పర్ల అలజడి రేగుతుంది. రోజంతా ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో రాత్రిపూట గ్రామాల సమీపంలో మొరం తవ్వకాలు చేపడుతున్న జేసీబీ చప్పుళ్లతో పాటు టిప్పర్లు, ట్రాక్టర్ల అలజడి రేగుతుందని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. అటవీ సమీపంలోని గుట్టలను తవ్వి మొరం తరలిస్తున్న అడిగే వారు లేకపోగా అడ్డు వచ్చిన వారికి మొరం మాఫియా మాములు ఇచ్చి మభ్యపెడుతున్నది. ఒక చెట్టును కొడితే జరిమానా విధించే అటవీశాఖ అధికారులు అసైన్డ్ భూముల్లో మొరం తవ్వుతూ కనబడితే జరిమానా విధించే రెవెన్యూ అధికారులు కను లున్న కనిపించడం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక మొరం తవ్వ కాలపై దృష్టిసారించాల్సిన మైనింగ్ అధికారులు ఫిర్యాదులు వెళ్లిన పట్టించుకోవడం లేదన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పత్రికలలో వార్తలు వస్తే దాడులు చేసి జరిమానాలు విధించి తమవంతు అయిపోయింది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

● మొరం మాఫియా తవ్వేది ఇక్కడవే..

అక్రమ మొరం తవ్వకాలు మండలంలోని అనేక గ్రామాల్లో కొనసాగుతున్నాయి. బోథ్ సమీపంలోని జీడిపల్లి గుట్ట పక్కన టీవీటి గ్రామం సమీపంలోని గుట్టలపైన బోథ్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న పిప్పల్దరి గుట్టల్లో మొరం తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక మరలపెల్లి సమీపంలో చింత గూడ గ్రామం సమీపంలోని అడవుల్లో మైనింగ్ మాఫియా గుట్టలను రోడ్లు వేసి మొరం తరలించుకుపోతున్నారు. ధన్నూర్ సమీపంలోని అడవుల నుండే కాక సోనాల గ్రామం సమీపంలో అసైన్డ్ భూముల నుంచి మొరం తవ్వకాలు కొనసాగిస్తున్నారు. కౌటా(బి) గ్రామం సమీపంలోని నీటికుంటలో ప్రతియేటా మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఫిర్యాదులు చేస్తే తప్ప అధికారులు అటు వైపు కన్నెతి చూడటం లేదని అంటున్నారు. మొరం మాఫియాను కట్టడి చేయకపోతే భవిష్యత్తులో ఎత్తైన గుట్టలు, మైదానాలుగా మారక తప్పదు.

యోగా క్యాంపును

సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, ఏప్రిల్ 18 : గోలేటి సింగరేణి పాఠశాల ఆవరణలో యువజన క్రీడాశాఖ యోగా కోచ్ కేసరి అలేఖ్య ఆధ్వర్యంలో సమ్మర్ యోగా క్యాంపు నిర్వహిస్తున్నట్టు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి అంజనేయులుగౌడ్ తెలిపారు. ఈ యోగా క్యాంపును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. సింగరేణి పాఠశాల ఆవరణలో సాయంత్రం 5.30నుంచి 6.30గంటల వరకు కొనసాగుతుందన్నారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ కొలిపాక కిరణ్, ఉపాధ్యక్షుడు పీఈటీ భాస్కర్ కోశాధికారి జగన్నాథ ఓడెలు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

ఆసిఫాబాద్ రూరల్, మే 18: భర్తను హత్యకేసిన చునార్కర్ కళావతితో పాటు ఆమె ప్రియుడు అక్కపెల్లి రవీందర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామానికి చెందిన చునార్కర్ రవీందర్ అనేవ్యక్తితో కళావతికి 16 సంవత్సరాలక్రితం పెళ్లి జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక సంవత్సరంనుంచి కళావతి అదే గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో ఆమెను పుట్టింటికి పంపించాడు. పెద్ద మనుషుల చొరవతో భర్త రవీందర్‌ను సముదాయించి మళ్లీ కాపురానికి పంపించారు. అయినా కళావతిలో మార్పు రాక పోవడంతోపాటు అక్కపల్లి రవీందర్‌తో వివాహేత సంబంధం కొనసాగించింది. ఈనెల16న రాత్రి చునార్కర్ రవీందర్, పిల్లలు నిద్రిస్తున్నట్లు తెలు సుకున్న అక్కపల్లి రవీందర్ వారి ఇంటికి వచ్చాడు. ఇంటివెనకాల వైపుగల రూంలో అలికిడి కావడంతో చునార్కర్ రవీందర్ లేచి అటువైపు వెళ్లగా కళా వతి, అక్కపల్లి రవీందర్ కలిసి ఉండడాన్ని చూశాడు. ఇక నేను చచ్చిపోతా నేను బతకను అని ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. అతను(చునార్కర్ రవీందర్) బతికిఉంటే విషయం ఎవరికైనా తెలుస్తుందే మోనని ఎట్లా అయినా అతన్ని చంపాలని కళావతి, అక్కపల్లి రవీందర్ నిర్ణయించుకొన్నారు. వెంటనే నైలాన్ తాడుతో ఉరిబిగించి చంపారు. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్నట్లు మృతదేహాన్ని దులానానికి వేలాడ దీసినట్లు వెల్లడించారు. శనివారం రహపల్లి గ్రామంలో కళావతి, అక్కపల్లి రవీందర్‌ను అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు పంపినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును పరిశీలించిన పీవో

ఆసిఫాబాద్‌రూరల్, మే 18: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజనక్రీడా పాఠశా లలో ఈనెల 16నుంచి 31వరకు నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్స్‌ను శనివారం ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా సందర్శించి క్రీడాకారులకు క్రీడాదుస్తులు, షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కొద్దిసేపు చెస్ ఆడి క్రీడా మైదానాన్ని పరిశీలించి పాఠశాలల ప్రారంభం వరకు క్రీడా పాఠశాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూర్చాలని డిప్యూటీ ఈఈ నిరంజన్‌కు సూచించారు.



ప్రధాన పోస్టాఫీస్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

పురుగుమందు డబ్బాలతో రైతుల నిరసన

● అధికారుల హామీతో ఆందోళన విరమణ

ఆదిలాబాద్ అర్బన్, మే 18: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రధాన పోస్టాఫీస్ ఎదుట తమ డబ్బులు చెల్లించాలంటూ పురుగుల మందు డబ్బాలతో రైతులు ఆందోళన చేపట్టారు. మూడు నెలల క్రితం రైతులను నమ్మించి పోస్టల్ ఖాతాలో ఉన్న పత్తి డబ్బులను ఆదిలాబాద్ పోస్ట్ ఆఫీస్ పేమేంట్ బ్యాంక్ మేనేజర్ మాయం చేసిన విషయం తెలిసిందే. అయితే మూడు నెలలుగా తమకు డబ్బులు రావడం లేదని, ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా.. తమ ఖాతాల నుంచి మాయమైన డబ్బులు జమకాక పోవడంపై రైతులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోస్టాఫీస్ సిబ్బంది హైదరాబాద్‌లోని తపాల ప్రధాన అధికారి, జీఎం జనార్ధన్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ఈనెల ఆఖరులోగా లేదా.. వచ్చే నెలలో డబ్బులు వస్తాయని భరోసా ఇచ్చారు. అయినా వినకుండా ధర్నాను కొనసాగించారు. పోలీ సులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. దీంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధిత రైతు అల్లూరి రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి అమ్మిన డబ్బులను పోస్టాఫీస్ మేనేజర్ కాజేసి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు రాలేదన్నారు. రేపుమాపు అంటూ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు చేతిలో డబ్బులు లేక సాగు చేయని పరిస్థితి ఉందన్నారు. త్వరలోనే తమ డబ్బులు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అధికారులకు విన్నవించినా.. వారు సానుకూలంగా స్పందిస్తున్నా.. డబ్బులు మాత్రం రావడం లేదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మురికినీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు : మున్సిపల్ కమిషనర్

ఆదిలాబాద్ అర్బన్, మే 18: వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్‌అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని పంజాబ్‌చౌక్‌లో గల పెద్ద మురికి కాలువలను సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. అనంతరం చుట్టుపక్కల షాపుల యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్‌అహ్మద్ మాట్లాడుతూ వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీరు కాలనీల్లో వెళ్లకుండా మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి పూడిక తీత పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. షాపుల యజమానులు చెత్తను మురికి కాలువల్లో వేస్తున్నారని, అలా వేస్తే జరిమానా వేస్తామన్నారు. కాలనీ ప్రజలు కూడా ప్లాస్టిక్‌ను మున్సిపల్ వాహనంలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, సిబ్బంది కాంతరావు, తదితరులున్నారు.

'మార్కెట్‌లో కెమికల్‌తో మగ్గించిన పండ్లు వస్తున్నాయి'

ఆదిలాబాద్ అర్బన్, మే 18: వేసవిలో మామిడిపండ్ల సీజన్ ఉందని, ప్రస్తుతం మార్కెట్‌లో కెమికల్‌తో మగ్గించిన పండ్లు వస్తున్నాయని కంజూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సహజ సిద్ధమైన మామిడి పండ్లు ఏప్రిల్, మే మాసంలోనే వస్తాయన్నారు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ఫిబ్రవరి నుంచే యెల్లో కలర్‌లో మామిడిపండ్లు వచ్చాయన్నారు. వీటిపై ఆరా తీస్తే ఎథోపెన్ కెమికల్ ద్వారా మగ్గిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కెమికల్‌ను మోతాదులో వాడాలని నిబంధన ఉన్న దానికి మించి వ్యాపారులు డబ్బుల కోసం వాడుతున్నారన్నారు. ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో ప్రజలకు కల్పించేలా తమ ఆర్గనైజేషన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



బోథ్‌లో మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : తుడుందెబ్బ

బోథ్, మే 18: ఈనెల 13న జైనూర్ మండల కేంద్రంలో అమాయక ఆదివాసీ యువకులపైన ఒక వర్గానికి చెందిన వారు దాడి చేయడంను తుడుందెబ్బ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివాసి యువకుడు అయిన మర్సకోల లక్ష్మణ్‌ను తీవ్రంగా గాయపరచడం క్షమించరానిదని వారు పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో బోథ్ డివిజన్ అధ్యక్షుడు విశ్వేశ్వర్‌రావు, మండల అధ్యక్షులు కనక అమృతరావు, దెబ్బ జిల్లా కమిటీ సలహాదారు పందరం శంకర్, బోత్ మండల కమిటీ నాయకులు పందరం సోనేరావు, నల్లోల శ్రీనివాస్, పుడసం కైలాస్, అచ్చంత రావు, శిడం రామ్, ఆత్రం భీమ్రావు, మడవి నాగోరావు, సుంగన్న, కేశవ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఎస్సై

యువకులకు వాలీబాల్ కిట్ అందజేత

గుడిహత్నూర్, మే 18: మండలంలోని మాన్కపూర్ గ్రామంలో యువకులకు శనివారం ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, గ్రామస్థులు కోవ భగవాన్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్ పుస్తకాల పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్, మే 18: సివిల్ సన్నద్ధం అవుతున్న పేద అభ్యర్థులకు తమవంతుగా పూర్తి సహకారం అందిస్తామని డాక్టర్ బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్ఆర్ అన్నారు. శనివారం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉచితంగా అందించే పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే కరీంనగర్, నిజామాబాద్, తదితర లాంటి జిల్లాల్లో ఆరోగ్య పరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధ్వానంగా గోల్లగాడ్ లింక్ రోడ్డు

● 'కొండ నాలుకకు మందు వేస్తే..' అన్న చందంగా కొత్త రోడ్డుతో మరింత ఇబ్బందులు ● నాసిరకం పనులతో స్థానికులకు తప్పని తిప్పలు ● నాణ్యత లేని రోడ్డు పనులు అంటూ మండిపడుతున్న గ్రామస్థులు





నాణ్యత లేని పనులతో అధ్వానంగా వేస్తున్న గోల్లగాడ్ లింక్ రోడ్డు ఇలా..

భీంపూర్, మే 18: ఆ మారు మూల గిరిజన గ్రామానికి లింకు రోడ్డు అధ్వాన్నంగా ఉండి గిరిజనులు నానా అవస్థలు పడ్డారు. ఎన్నో విజ్ఞప్తుల ఫలితంగా మంజూరైన ఆ రోడ్డును కాంట్రాక్టర్ ఇష్ట రాజ్యంగా చేస్తూ ఉండటంతో అసలు నడవ లేని పరిస్థితి తయారైంది. వివరాలిలా ఉన్నాయి.. భీంపూర్ మండలం సరిహద్దు గ్రామం గోల్లగాడ్ అక్కడికి వెళ్లేందుకు పిప్పల్‌కోటి నుంచి వెళ్లేందుకు 4 కిలోమీటర్ల కచ్చా రోడ్డు ఉండేది. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలతో నరకంగా ఉండేది. వాస్తవానికి గతంలో అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించారు. తరువాత ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శ్రద్ధతో మట్టి రోడ్డు మంజూరు అయింది. అయితే స్థానిక మండల నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ రోడ్డుపై మట్టి పోసేసి చేతులు దులుపుకున్నాడు. మొన్నటి గాలి వానకు ఈ మట్టి రోడ్డుపై పూర్తిగా నీరు నిలిచి గాలి వానకు ఈ మట్టి రోడ్డుపై పూర్తిగా నీరు నిలిచి వాహనాల సంగతి అటు ఉంచితే నడవలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఆ ప్రాంతానికి ప్రచారానికి వచ్చిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కూడా ఈ రోడ్డు ఎవరూ వేస్తున్నారు. ఇంత అధ్వాన్నంగా ఉంది అనే కోపంతో వాకబు చేశారు.



గోల్లగాడ్ ముఖచిత్రం

ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవాలి

: మాడావి దీపక్, స్థానికుడు గోల్లగాడ్



నిజం చెప్పాలంటే గతంలో ఉన్న కచ్చా రోడ్డే బాగుండేది. ఈ రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్ ఎవరో తెలియడం లేదు. పూర్తిగా నాణ్యత లేని రోడ్డు నిర్మాణంతో మేము ఏమి చేయాలో అర్థం కావడం లేదు. కాంట్రాక్టరు ఇప్పటికైనా పనులు నాణ్యతగా చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలి.

కన్నులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

జైనథ్, మే 18: మండలంలోని గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడ వెంకటేశ్వర ఆలయాన్ని రంగురంగుల పూలతో పాటు వివిధ రంగులతో గల విద్యుత్ మెర్క్యురి బల్బులతో అలంకరించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య డప్పుల భజాలతో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గూడ గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎంపీపీ ఎం.గోవర్ధన్, గూడ ఎంపీటీసీ తోట రమరమేష్, డీసీసీబీ డైరెక్టర్ కె.పురుషోత్తం, మాజీ సర్పంచ్ ఎన్.ప్రభాకర్‌లతో పాటు గూడ గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దసంఖ్యలో హాజరైన మహిళలు

జొన్న రైతుకు కలిసి వచ్చిన కాలం!!

● ప్రభుత్వ రంగ సంస్థల కొనుగోలుతో ఆర్థికంగా లాభం

బోథ్, మే 18: ఈ ఏడాది జొన్న పంట సాగు చేసిన రైతులకు కాలం కలిసి వచ్చింది. పంట వేసినప్పటికీ నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడి సైతం ఆశించిన దాని కంటే అధికంగా రావడంతో రైతులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ళ వరకు దిగుబడి రావడంతో రైతులు సంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. అయితే పండించిన పంటను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ ముందుకు రావడం బహిరంగ మార్కెట్‌లో కంటే దాదాపు వెయ్యి రూపాయలు అధికంగా ధర పెట్టి కొనుగోలు చేస్తుండటంతో రైతులు మార్క్‌ఫెడ్‌కు విక్రయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. బోథ్ మార్కెట్‌కు ఇప్పటి వరకు దాదాపు పది వేల క్వింటాల్‌కుపైగాజొన్న పంటను రైతులు తీసుకురావడం జరిగింది. అయితే పంటను అమ్మిన పది రోజుల్లో రైతుల అకౌంట్‌లో డబ్బులు పడుతుండటంతో సంతోషం వ్యక్తపరుస్తున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా జొన్న పంట డబ్బులు సకాలంలో రైతుల అకౌంట్‌లో జమ అయిపోతున్నాయి. ఏది ఏమైనా రబీలో జొన్న పంట సాగు చేసిన రైతులకు కాలం కలిసి వచ్చినట్లు అయింది.



బోథ్ మార్కెట్‌లో కొనుగోలు జరుపుతున్న దృశ్యం

భైంసాలో రియల్ ఎస్టేట్ వ్యాపారిని

డబ్బుల కోసం వేధించిన కేసులో ఒకరి అరెస్టు

● నిందితుడు బాలాజీ సూత్రావే వద్ద రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం ● 14 రోజుల రిమాండ్ విధింపు

భైంసా, మే 18 : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరిని కమీషన్‌గా డబ్బులు ఇవ్వాలని వేధించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లుగా భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి వెల్లడించారు. శనివారం ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనను విడుదల చేశారు. సీఐ రాజారెడ్డి ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం.. భైంసా మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ అనిత సూత్రావే భర్త, వ్యాపారి బాలాజీ సూత్రావే గత కొంతకాలంగా స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి కె.అరవింద్‌ను తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు పరిధిలోని రాహుల్‌నగర్ కాలనీలో వెంచర్ చేసి ప్లాట్లు విక్రయాలు చేపట్టినందుకు గాను రూ.20 లక్షలు కమీషన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో సంబంధిత విషయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వార్డు పరిధిలో చేపట్టిన వెంచర్‌లోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సదరు రియల్ వ్యాపారి తన మిత్రులతో బాలాజీ సూత్రావేను కలిసి మాట్లాడుకొని రూ.10 లక్షలను కమీషన్‌గా అప్పచెప్పినాడు. మిగతా రూ.10 లక్షలు ఇవ్వకపోవడంతో.. సదరు రియల్ వ్యాపారి నేతాజీనగర్‌లో చేపట్టిన మరో వెంచర్‌లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ తిరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో రియల్ వ్యాపారి కె.అరవింద్ సెల్‌ఫోన్ ద్వారా వ్యాపారి బాలాజీ సూత్రావేను సంప్రదించగా.. కమీషన్‌గా రూ.10 లక్షలు చెల్లించేంత వరకు తాను రిజిస్ట్రేషన్ కానివ్వబోనంటూ స్పష్టం చేశారు. సంబంధిత సంభాషణలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన రియల్ వ్యాపారి కె.అరవింద్ శుక్రవారం టౌన్ పోలీసు స్టేషన్‌లో కమీషన్ చెల్లించాలంటూ వేధింపులకు గురి చేస్తున్న విషయమై వ్యాపారి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు శనివారం బాలాజీ సూత్రావేను అరెస్టు చేసి అతను వినియోగిస్తున్న రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపరుచుకున్నారు. భైంసాలోని కోర్టులో నిందితున్ని హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కాగా కమీషన్ డబ్బుల కోసం వేధించిన కేసులో అరెస్టు చేయబడి రిమాండ్‌కు తరలించబడ్డ బాలాజీ సూత్రావే డివిజన్ పరిధిలో బీజేపీ పార్టీలో కీలకనేత. ఇది వరకు ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, పట్టణ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు.

గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ ఎత్తుకెళ్లారు

● పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అంజని తండా పంచాయతీ కార్యదర్శి

నర్సాపూర్(జి), మే 18 : మండలంలోని అంజని తండా గ్రామపంచాయతీ కార్యాలయం చెత్త సేకరించే ప్రభుత్వ ట్రాక్టర్ గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారని పంచాయతీ కార్యదర్శి శనివారం పోలీస్టుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



సారంగాపూర్, మే 18 : మండలంలోని బీరవెల్లి గ్రామ సమీపంలో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీరవెల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమచారం రావడంతో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న దయాకర్, గణేష్, షాహిద్ బాబు, షైక్ రసూల్, సాయన్న, శంకర్, మహేందర్‌లను పట్టుకొని రూ. 31 వేలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

'బరంపూర్ తిరుమల కొండను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి'

తలమడుగు, మే 18: బరంపూర్ తిరుమల కొండను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం బరంపురం కొండపై స్వయంభుగా వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తిరుపతగా అభివృద్ధి చెందుతున్న బరంపూర్ తిరుమల కొండను ఆదిలాబాద్ జిల్లాకు ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. భక్తుల గ్రామస్థుల సహకారంతో దాదాపు రూ.ఐదు కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతీ శనివారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం పదో తరగతి ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులను ఆయన సన్మానించారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదరేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేశ్, ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, రమాకాంత్, సత్యనారాయణ, మల్లేష్, అభిరామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల షాపుల ఎదుట బారులు

ఆదిలాబాద్ అర్బన్, మే 18: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో రైతులు విత్తనాల షాపుల ముందు క్యూ కట్టారు.పత్తి రైతులకు కావాల్సిన రాశి 659 రకం విత్తనం కోసం శనివారం ఉదయం నుంచ సీడ్స్, ఫర్టిలైజర్ షాపుల ముందు అన్నదాతలు బారులు తీరారు. షాపులలో రాశి కంపెనీ విత్తనాలు బ్యాగులున్న వ్యాపారులు నో స్టాక్ బోర్డులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు పట్టణంలోని పలు విత్తనాల షాపులను వ్యవసాయ అధికారులు తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు.



పూజలో పాల్గొన్న మహిళలు

వైభవంగా శ్రీవాసవి మాత జన్మదినం



పూజలందుకుంటున్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ దేవి

ఆదిలాబాద్ అర్బన్, మే 18: శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి వసంతోత్సవ జన్మదిన వేడుకలను ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహించారు. శనవారం అమ్మవారి జననం సందర్భంగా ప్రత్యేక పూజలతో కొలిచారు. ఉదయం నుంచే ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కన్యక పరమేశ్వరి దేవి ఆలయంలో భక్తుల తాకిడి కనిపించింది. ఈ మేరకు ప్రత్యేక పూజలు, హారతులతో అమ్మవారిని ఆరాదించారు. బంగారు పూతతో కూడిన చీరలో అమ్మవారు శ్రీకన్యకాపరమేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.



పాత ఉట్నూర్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న పశువులు

రోడ్లపైనే పశువులు.. ప్రజలకు ఇక్కట్లు!

ఉట్నూర్, మే 18: ప్రధాన రహదారులపై పశువులు తిష్ట వేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉట్నూర్ పట్టణంలోని కేబీ కాంప్లెక్స్, పాత ఉట్నూర్, తెలంగాణ చౌక్, అంబేద్కర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, జగ్జీవన్‌రామ్ చౌక్ ప్రాంతాలలో పశువులు రోడ్లపైనే ఉంటుండడంతో వాహనచోదకులతో పాటు, కాలిబాట వెళ్తున్న ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పశువుల యజమానులు తమ పశువులను ఇళ్లలో కట్టి వేయకుండా వదిలి వేస్తుండడంతో మేత కోసం తిరుగుతు పశువులు రోడ్లపైన సంచరించడంతో పాటు సేద తీరుతున్నాయి. ఫలితంగా ద్విచక్ర వాహనదారులు పశువులు అడ్డంగా రావడంతో కిందపడిపోతు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో సైతం పశువుల యజమానులు తమ పశువులను ఇళ్లవైపు తీసుకు వెళ్లడం లేదు. గ్రామ పంచాయతీ అధికారులు పలుమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ.. యజమానులలో మార్పు రావడం లేదు. రోడ్లపైన తిరుగుతున్న పశువులను పంచాయతీ వారు తీసుకువెళ్లి పంచాయతీల గజగాట్లో వేసినట్లయితే పంచాయతీకి కూడా ఆదాయం వస్తుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులతో పాటు పంచాయతీ అధికారులు స్పందించి పశువులు రోడ్లపై సంచరించకుండా ఉండడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



టీచర్స్‌కాలనీలో దుర్గంధ భరితంగా మారిన దృశ్యం

ఇలా ఉంటే వ్యాధులు రావా!

ఇచ్చోడ, మే 18: చుట్టూ నివాస గృహాలు.. వాటి మధ్య ఖాళీ ప్రదేశాలు.. అవి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో పాములు, పందులకు నిలయాలుగా మారాయి. స్థల యాజమానులు వీటిని శుభ్రపరచకపోవటంతో వాటి చుట్టుపక్కల నివసించే వారికి సమస్యగా మారింది. ఖాళీ స్థలాల యజమానుల వివరాలు తెలియకపోవటంతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడంలేదు. దోమల కారణంగా వేసవిలో సైతం జనం జ్వరాల బారిన పడి ఆసుపత్రుల బాటపడుతున్నారు. ఇలాంటి దుర్గంధభరిత ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లటం, ఫాగింగ్ చేయటం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది కానీ అలా జరక్కపోవడంతో సమస్య యథాతథంగా కొనసాగుతుంది. ఇప్పటికైన గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనాలోనైనా కాలనీలు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని టీచర్స్ కాలనీ వాసులు కోరుతున్నారు. ఇచ్చోడ.. పేరుకే పెద్ద పంచాయతీ అయిన సమస్యలు పరిష్కరించడంలో మాత్రం అధికారులు ముందడుగు వేయడంలేదని స్థానికులు తమ గోడును వెల్లబుచ్చుకుంటున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.8, కనిష్ఠం 25.7



'రేషన్ సకాలంలో పంపిణీ చేయాలి'

తాంసి, మే 18: ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్లు ప్రతినెల రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ లక్ష్మీ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సరుకలను అందించాలన్నారు. ముఖ్యంగా చివరిరోజున గ్రామంలో ప్రజలందరికీ తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రేషన్ బియ్యాన్ని తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌలు రైతు కన్నీరు



- జిల్లాలో మొదలైన కౌలు భూముల ఒప్పందాలు
- దిగుబడులు పెరగడంతో సాగు భూములకు డిమాండ్
- దిగి రాని కౌలు ధరలు
- ప్రభుత్వ పథకాలు, పంట నష్ట పరిహారానికీ నోచుకోని కౌలు రైతులు



పత్తి పంటలో దౌర కొడుతున్న రైతులు

ఆదిలాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి)

వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన కౌలు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. యేటా పెరిగి పోతున్న కౌలు ధరలు రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్నాయి. సొంతంగా గుంట భూమి లేక పోవడంతో గత్యంతరం లేక కౌలు భూములను సాగు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వానకాల పంటల సీజన్ దగ్గర పడడంతో ప్రతీయేటా మాదిరిగానే ఈ యేడు జిల్లాలో కౌలు భూముల ఒప్పందాలు మొదలయ్యాయి. ముఖ్యంగా జిల్లాలో వర్షాధార పంటలనే ఎక్కువగా సాగు చేస్తారు. అయిన కౌలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నీటి వసతిని కలిగి ఉన్న నల్ల రేగడి భూములకు భారీగా డిమాండ్ ఏర్పడుతుంది. జిల్లాలో మొత్తం లక్షా 47వేల మంది రైతులు ఉండగా సుమారు 30వేలకు పైగా కౌలు రైతులు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. గత ప్రభుత్వ హాయాంలో 10వేల మంది రైతులు రుణ అర్హత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా.. కేవలం 5125 మంది రైతులకు మాత్రమే అర్హత కార్డులను అధికారులు అందించారు. ఈ యేడు ఇప్పటి వరకు కౌలు రైతులను గుర్తించిన దాఖలాలే కనిపించడం లేదు. కౌలు రైతుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యల పై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయలేదు. ఇప్పటికే జిల్లాలో వానకాల పంటల సాగు పనులు ఊపందుకున్నాయి. కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు. గతంలో కౌలు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ చొరవతో కిసాన్ మిత్ర సెల్‌ను ప్రారంభించారు. దీంతో కొంత మంది రైతుల సమస్యలకు అధికారులు పరిష్కారం చూపారు. వరుసగా గత రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలతో కౌలు రైతులు నష్టాల పాలవుతున్నారు. అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులను ఆదుకునే కనీస ప్రయత్నం చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

మద్దతు ధరలపై ఆశలు

ప్రతియేటా పెరుగుతున్న మద్దతు ధరలు, అధిక దిగుబడులతో సాగుభూములకు భారీగా డిమాండ్ ఏర్పడుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం కూడా కలిసి వస్తుంది. జిల్లాలో ప్రధానంగా పండించే పత్తి, సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర దక్కడంతో రైతులు పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగం విరివిగా పెరిగి పోవడంతో పంటల సాగు సులభంగా మారుతుంది. దీంతో పంటల సాగుపై కొంత అనుభవం ఉన్న రైతులందరు భూములను కౌలుకు తీసుకుంటు సాగు చేస్తున్నారు. గ్రామాల్లో నీటి వసతి, నల్ల రేగడి భూములను దక్కించుకునేందుకు కౌలు రైతులు పోటీ పడుతున్నారు. దీంతో భూ యజమానులకు మరింత కలిసి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పత్తి, సోయా, జోన్న, కంది పంటలకు మద్దతును మించిన ధరలు పలుకడంతో రైతులు పంటల సాగు పై ఆసక్తి చూపుతున్నారు. అలాగే కొంత మంది నిరుద్యోగ యువకులు కూడా భూములను కౌలుకు తీసుకుంటూ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

ఎకరం కౌలు రూ.35వేలు

జిల్లాలో నీటి వసతి, భూముల స్వభావాన్ని బట్టి కౌలు ధరలను నిర్ణయిస్తారు. ఈ యేడు ఎకరాన గరిష్టంగా రూ.35 వేలు కౌలు ధర పలికినట్లు తెలుస్తుంది. గతేడు రూ.25వేలు పలికిన ఎకరం కౌలు ధర ఈ సారి ఏకంగా రూ.35వేలకు పెరగడంతో కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. గత నాలుగైదేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్న యజమానులు కౌలు ధరలను మాత్రం తగ్గించడం లేదు. పెట్టుబడి సహాయంతో పాటు బ్యాంకు రుణాలను యజమానులే జేబులో వేసుకుంటున్నారు. వ్యవసాయం తప్పా మరే రంగంలో పరిజ్ఞానం లేని కౌలు రైతులు గత్యంతరం లేక పంటల సాగునే నమ్ముకుంటున్నారు. ప్రతి యేటా ఫిబ్రవరి 15 నుంచి మే 15 వరకు 3నెలల పాటు అర్హులైన కౌలు రైతులను గుర్తించి రుణ అర్హత కార్డులను జారీ చేయాలి. అలాగే బ్యాంకు రుణాలు అందే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. కానీ జిల్లాలో ఈ యేడు ఎక్కడ ఇలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామాల్లో అవగాహన సదస్సులు కూడా ఏర్పాటు చేయడం లేదు. సరైన ఆధారం లేదన్న కారణంగా అందాల్సిన ప్రభుత్వ సహాయం అందడం లేదు. అసలే నిరక్షరాస్యులైన గ్రామీణులకు కౌలు చట్టాల పై కనీస అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రభుత్వ సహాయానికి దూరం

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక, ఇతర సహాయానికి కౌలు రైతులు దూరమవుతున్నారు. గత నాలుగైదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నగదు సహాయానికి కౌలు రైతులు నోచుకోవడం లేదు. అలాగే ఈ యేడు వానకాల పంటల నుంచి వరి పంటకు అదనంగా రూ.500లను బోనస్‌గా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కౌలు రైతుల వద్ద ఎలాంటి ఆధారం లేదన్న సాకుతో ప్రభుత్వం సహాయాన్ని అందించేందుకు ముందుకు రావడం లేదు. పెట్టుబడి సహాయం అందిన యజమానులు కౌలు ధరలు కూడా తగ్గించక పోవడంతో గత్యంతరం లేక అధిక కౌలును చెల్లించాల్సి వస్తుంది. యజమానులు కౌలు ఒప్పంద పత్రాన్ని రాతపూర్వకంగా రాసి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో కౌలు రైతులకు ఎలాంటి ఆధారమే లేకుండానే పోయింది. ఈ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయిన ఈ యేడు మళ్లీ నష్టాలతోనే కౌలు రైతులు పంటలను సాగు చేసేందుకు గంపెడు ఆశలతో సన్నద్ధమవుతున్నారు.

'20 నుంచి జూన్ 2 వరకు టెట్ పరీక్ష'

ఆదిలాబాద్ అర్బన్, మే 18: ఈ నెల 20 నుంచి వచ్చే నెల జూన్ 2 వరకు రెండు రెండు విడతల వారీగా టెట్ పరీక్ష ఉంటుందని అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని డీఈవో ప్రణీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రీక్ష ఉంటుందన్నారు. మావలలోని నలంద డిగ్రీ, పీజీ కాలేజ్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని, 1591 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు.

'కుల, మత రహిత సమాజ నిర్మాణమే వీరబ్రహ్మేంద్ర స్వామి వారికిచ్చే ఘన నివాళి'

నేరడిగొండ, మే 18: కుల, మత రహిత సమాజ నిర్మాణమే వీరబ్రహ్మేంద్ర స్వాముల వారికిచ్చే ఘన నివాళి అని కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల గుండా విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 17వ శతాబ్దం దక్షిణ భారతదేశంలో మూఢాచారాలు, అంధవిశ్వాసాలపై, వర్ణ వ్యవస్థ, కుల, మత వైశమ్యాలపై, అంటరానితనంపై, బలహీన వర్గాలకు విద్య అవకాశాలు అందాలని తన జీవితకాలమంతా ప్రజల్లో స్వామివారు చైతన్యం రగిలించారనిని గుర్తు చేశారు. మానవాళికి జ్ఞానోదయాన్ని కలిగించిన క్రాంతిదర్శి అని కొనియాడారు. వీరబ్రహ్మేంద్ర స్వామి 1693 వైశాఖ శుద్ధ దశమి రోజున జీవసమాధి అయ్యారని గుర్తు చేశారు. కుల, మత రహిత సమాజ నిర్మాణ కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో మాజీ సర్పంచ్ రాజుయాదవ్, పురుషోత్తం, బ్రహ్మయ్య, శంకర్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి పల్లకీతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



వీసీలో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ ఎం మహేందర్‌రెడ్డి



పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

గ్రూప్-1 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్ అర్బన్, మే 18: జూన్ 9న నిర్వహించనున్న తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల ఏర్పాట్లపై టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ ఎం మహేందర్‌రెడ్డి గూగుల్‌మీట్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షిషా కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని, పకడ్బందీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి మాల్ ప్రాక్టిస్ జరుగకుండా చూడాలని సూచించారు. గ్రూప్ -1 పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 9గంటల లోపే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా 9.30 గంటలకు బయోమెట్రిక్ హాజరు మొదలవుతుందని పేర్కొన్నారు. పరీక్ష ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. తగిన నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఈ మేరకు సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్‌ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ సంబంధించిన వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దని పేర్కొన్నారు. కలెక్టర్లు పోలీసు శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా పరీక్ష కేంద్రంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'గట్టి పోలీసు బందోబస్తు ఉంచాలి'

ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ హెడ్‌క్వార్టర్లలో తగిన బందోబస్తు మధ్య ఉంచాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా పరీక్ష కేంద్రాలకు వాటిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని, పరీక్ష కంటే ముందు ఇన్‌టైంలో చేరేలా చూడాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 18 కేంద్రాలను, రీజనల్ సెంటర్-1 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 6,729 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, ఇందుకు సంబంధించి రూట్ ఆఫీసర్లు ఐదుగురు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, తదితర సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. 144 సెక్షన్ అమలు, స్ట్రాంగ్‌రూమ్, సెక్యూరిటీ, పరీక్ష కేంద్రంలో అన్ని మౌళిక వసతుల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలి'



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, మే 18: తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవోలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో టీజీగా ఉండాలని, ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటనామస్ విభాగాలన్నీ దీనిని పాటించాలని ఆదేశించారు. తెలంగాణ ఇప్పటి వరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైన టీజీ నిబంధన ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింప చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు ఇకపైన టీఎస్ అబ్రివేషన్ స్థానంలో అధికారికంగా టీజీ అని మార్చుకునేలా ఈ నెల 30న డెడ్‌లైన్‌గా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికి ఇది వర్తిస్తుందన్నారు. వెబ్‌సైట్లతో పాటు అన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు,రిపోర్టుల్లో టీజీ పదాన్నే (అబ్రివేషన్) వినియోగించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం టీజీ అనే అబ్రివేషన్‌ను అధికారికంగా గుర్తించడంతో ఈ మార్పును అన్ని విభాగాలు అమల్లోకి తెచ్చేలా ఆయా డిపార్ట్‌మెంట్ల కార్యదర్శులు, హెడ్‌ఓడీలు పర్యవేక్షించాలని సీఎస్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. టీజీ అనే అబ్రివేషన్‌ను ఇకపైన అధికారికంగా వినియోగించాలని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి కలిగిన (అటానమస్) సంస్థలు ఈ మార్పును కార్యచరణలో పెట్టాలన్నారు. అధికారులు వాడే లెటర్‌హెడ్స్, రిపోర్టులు, నోటిఫికేసన్లు, నేమ్ బోర్డులు, వెబ్‌సైట్‌లు, ఇతర అన్ని రకాల వినియోగంలో ఈమార్పును చేపట్టాలని స్పష్టం చేశారన్నారు. దీంతో ఇప్పటి వరకు టీఎస్‌పీఎస్‌సీ, టీఎస్‌ఆర్టీసీ పేర్లతో కొనసాగుతున్న సంస్థలు టీజీపీఎస్‌సీ, టీజీఆర్టీసీ అని మార్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వివిధ శాఖలు, విభాగాల మధ్యజరిగే అంతర్గత కరస్పాండెన్స్ (ప్రత్యుత్తరాలు)తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారంలోను టీజీ అనే అబ్రివేషన్‌నే వినియోగించాలని సూచించారు. అన్ని శాఖలు, విభాగాలు ఈ మార్పులు చేపట్టిన అంశంపై ఆయా శాఖల కార్యదర్శులు ఈనెల30లోపు సాధారణ పరిపాలన శాఖ జాయింట్ సెక్రటరీ(కో ఆర్డినేషన్)కు రాత పూర్వకంగా (యాక్షన్ టేకెన్ రిపోర్టు) తెలపాలని సీఎస్ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాల్లో టీఎస్‌కు బదులు టీజీగా మార్చి ఈనెల 26లోపు నివేదికలు సమర్పించాలని శాఖల అధికారులను ఆదేశించారు.

చెరువులకు మరమ్మతులు చేపట్టాలని

- జిల్లా నీటిపారుదల శాఖ అధికారులను కలిసిన రైతులు

తలమడుగు, మే18: కజ్జర్ల గ్రామ సంఘంలో గల చెరువులకు మరమ్మతులు చేపట్టాలని కజ్జర్ల రైతులు జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాస్‌కు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతు కజ్జర్ల గ్రామ సమీపంలో నిర్మించిన చెరువులు దశాబ్దాల క్రితం కావడంతో తూములు మరమ్మతులకు గురయ్యాయన్నారు. దీంతో పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. అంతేకాకుండా భారీ వర్షాలకు చెరువు కట్టలకు ప్రమాదం పొంచి ఉందని, దీని వల్ల ఖోడద్, హస్నాపూర్, తాంసి మండలాల రైతులకు, గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. వెంటనే అధికారులు స్పందించి చెరువులకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతేకాకుండా ఈ విషయమె కలెక్టర్ దృష్టికి జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఇందులో గ్రామ రైతులు, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతలపల్లి దేవారెడ్డి, బోథ్ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రామన్న తదితరులున్నారు.



జిల్లా నీటి పారుదల శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతులు



జొన్నల కొనుగోలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ..

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

- సంబంధిత అధికారులపై మండిపడ్డ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- తాంసిలో జొన్నల కొనుగోలు కేంద్రం పరిశీలన

తాంసి, మే 18: జొన్నల కొనుగోలు విషయంలో రైతులకు, సంబంధిత శాఖ అధికారులు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్థానిక అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో కొనుగోలు చేస్తున్న జొన్నల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు కల్పించిన సౌకర్యాలను గురించి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎందుకు ఇబ్బందులు కలిగిస్తున్నారు అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యాపారులకే ఎందుకు కొమ్ముకాస్తున్నారని నిలదీశారు. కష్టపడి పండించిన రైతులకు కష్టాలు వస్తే సహించబోమని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఏ అవసరం ఉన్నా తనను సంప్రదించాలని కోరారు. రైతుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యం అని అన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు సరైన సౌకర్యాలు లేవని ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల కోసం ప్రతీఒక్కరు తమ వంతు సహకారం అందించాలి తప్ప రైతులను వేధించడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, కౌడాల మహేందర్, అశోక్, తదితరులు ఉన్నారు.